ప్రజాశక్తి
ఆదివారం 4 జూన్ 2023

5న జూనియర్ బాలబాలికల బాక్సింగ్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా జూనియర్ బాల బాలికల బాక్సింగ్ జట్ల ఎపిక ఈనెల 5న రాజీవ్‌స్టేడియంలో ఉదయం 7గంటల నుంచి జరుగుతుందని బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మధకుమార్ తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు పాస్‌పోర్టు సైజు పోటో, ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని తెలిపారు. ఎంపికైన ఈనెల 16 నుంచి 18 వరకు విజయవాడలో జరుగు 5వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజయనగరం జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు.వివరాలకు శాప్ కోచ్ బి.ఈశ్వరరావు ఫోన్ నెంబరు 9908353698ను సంప్రదించాలని తెలిపారు.

రైళ్ల రద్దుతో స్టేషన్ బయట పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

ఊపిరిపీల్చుకున్న జిల్లా వాసులు

- పలు రైళ్ల రద్దుతో తప్పని నిరీక్షణ
- తాగునీటి కోసం అల్లాడిన ప్రయాణికులు
- రైల్వేస్టేషన్, కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

స్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్ జిల్లాలో జరిగిన రైళ్ల ప్రమాద మృతుల్లో జిల్లా వాసులెవరూ లేకపోవడంతో జిల్లా అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గురైన రెండు రైళ్లలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌రైలు హౌరా నుంచి విజయనగరం మీదుగా చెన్నై వెళ్లనుండగా, యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ విజయనగరం మీదుగా హౌరా వెళ్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రమాదం జరగడంతో జిల్లాకు చెందిన ప్రయాణికులు ఉన్నారేమోనని అంతా ఆందోళన చెందారు. ప్రమాదం విషయం తెలుసుకొని అధికారులు ఆరా తీశారు. మృతుల్లో ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ ప్రమాదం నేపథ్యంలో విజయనగరం మీదుగా ఒడిశా వైపు వెళ్లే పలు రైళ్లను రైల్వే అధికారులు రద్దు చేయడంతో విజయనగరం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓవైపు ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిపోతూ తాగునీటి కోసం పడరాని పాట్లు పడ్డారు. ఒడిశాలోని స్వగ్రామాలకు, వివిధ పనులపై వెళ్లేందుకు విజయనగరం స్టేషన్‌లో నిరీక్షించారు. రద్దయిన వాటిలో 12864 యశ్వంత్‌పూర్ -హౌరా, 12839 హౌరా మెయిల్ చెన్నై, 12703 హౌరా-సికింద్రాబాద్ (ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్), 12509 బెంగళూరు-గౌహతి, 18046 హైదరాబాద్ షాలిమార్ (ఈస్ట్ కోస్ట్)రైళ్లు ఉన్నాయి.

స్వల్ప గాయాలతో బయటపడ్డాం

సీతంపేట : ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్ జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం కొత్త పనుకువలసకు చెందిన కాదూరి లోకేష్, ఆయన తల్లి అక్కమ్మ, భార్య విన్ని, పిల్లలు హేమంత్, కరిష్మా స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరంతా కోల్‌కత్తా నుంచి కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నం వస్తున్న తరుణంలో ఈ ప్రమాదం జరిగింది. తామంతా బి-5 ఎసి బోగీలో ప్రయాణిస్తున్నామని, ఒక్కసారిగా బోగీలు పల్టీలు కొట్టాయని, తమ బోగీ మాత్రం కుదుపునకు గురైందని తెలిపారు. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలై తృటిలో పెను ప్రమాదం నుంచి తప్పించుకొని ప్రాణాలతో బతికి బయట పడ్డామని తెలిపారు. ఆ సమయంలో ఎంతో భయాందోళనలకు గురైనట్లు తెలిపారు. ఈ ఘటనలో లోకేష్ కాలికి చిన్నగాయం తగలగా, ఆయన భార్య విన్నీ తలకు, నడుముకు, కాలికి గాయం కావడంతో ప్రథమ చికిత్స అనంతరం ప్రత్యేక రైలులో రైల్వే అధికారులు విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. లోకేష్ పెద్దన్నయ్య కలకత్తాలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. వేసవి సెలవుల నిమిత్తం అక్కడికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈ సంఘటనలో చిక్కుకున్నారు.

ప్రమాదం నుంచి బయటపడిన లోకేష్ కుటుంబం

విజయనగరం మీదుగా పలు రైళ్లను భువనేశ్వర్ వరకు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సుమారు 30రైళ్లను టిట్లాగర్, జార్జ్‌గూడ్, కటక్, అంగోర్, సంబల్పూర్ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. రైలు ప్రమాద బాధితుల సమాచారం తెలుసుకునేందుకు, ప్రతి సమాచారాన్ని అందించేందుకు స్టేషన్‌లో హెల్ప్‌డెస్క్‌లు 08922 83331, 2,3,4, 08922 221202, 221206 పోన్ నెంబర్లతో ఏర్పాటు చేసినట్లు స్టేషన్ మాస్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఇక్కడ సిటిఐ బి.గణపతిరాజు, సీనియర్ టిసి ఆర్‌కె షాను, సిటిఐలు పి .సూర్యారావు, బిఎస్ రావు, ఎం.సంతోషి ఎప్పటికప్పుడు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నారు.

రైలు ప్రమాద బాధితుల సహాయం కోసం కంట్రోల్ రూం

కంట్రోల్ రూం వద్ద సిబ్బంది

ఒడిశాలోని బాలాసోర్ వద్ద నిన్న జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద దుర్ఘటనలో జిల్లాకు సంబంధించిన వారి సమాచారాన్ని సేకరించి వారికి అవసరమైన అన్ని రకాల సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ప్రమాదంలో తమ కుటుంబాలకు సంబంధించిన వారు ఎవరైనా వుంటే ఆ వివరాలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు తెలియజేయాలన్నారు. 08922-236947 ఫోన్ నెంబరుతో ఈ కంట్రోల్ రూం పనిచేస్తుందని తెలిపారు.

జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్‌లు, ఎంపిడిఒలు తమ పరిధిలో ఈ రైలులో ఎవరైనా ప్రయాణికులు వున్నట్లయితే ఆయా సమాచారాన్ని వెంటనే సేకరించి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమాచారం తక్షణం అందించాలని ఆదేశించారు. రైలు ప్రమాద ఘటనపై ఎంపిడిఒలు, తహశీల్దార్‌లతో టెలి కాన్ఫరెన్సు ద్వారా జెసి శనివారం సమీక్షించారు. గ్రామ సచివాలయాల ద్వారా ఈ రైలులో ప్రయాణిస్తున్న జిల్లా వాసుల సమాచారాన్ని తక్షణం సేకరించి అందజేయాలన్నారు. గాయపడి ఉంటే ఏ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారనే సమాచారం సేకరించాలన్నారు. ఘటనలో మృతిచెందిన వారి సమాచారం కూడా అందజేయాలని చెప్పారు.

నిప్పులకొలిమి

ఉక్కపోత, వేడికి అల్లాడుతున్న జనం • నిర్మానుష్యంగా రహదారులు

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎండల తీవ్రత నిప్పల కొలిమిలా ఉంది. రోహిణికార్తె నేపథ్యంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలకు జనం మాడు పగులుతోంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు వడగాల్పులు తోడై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు జ్వరాల బారిన పడుతున్నారు. ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతోంది.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత వారం రోజులుగా రెండు జిల్లాల్లోనూ 40 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో జనం ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. మధ్యాహ్నం వేళల్లో నగరంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రధానంగా రెండు రోజులుగా పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఎండ వేడిమితో బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఇళ్లల్లో సైతం ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారులపై జన సంచారం, వాహనాల రద్దీ అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. బస్సుల్లో ప్రయాణికులు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గత నెలరోజులుగా శీతలపానీయాలకు గిరాకీ పెరిగింది. వేసవి తాపానికి పిల్లలు, వృద్ధులతోపాటు పక్షులు, మూగజీవాలు అల్లాడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వలన మూగజీవులు సైతం అల్లాడి పోతున్నాయి. నిన్నటి వరకు మే నెల ఉష్ణోగ్రతలతో సతమతమైన జనం నేడు రోహిణికార్తె ప్రభావానికి భీతిల్లుతున్నారు. నిప్పుల కొలిమిగా మారడంతో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు నానా తంటాలు పడుతున్నారు. గాలిలో తేమశాతం తగ్గడంతో ఉదయం ఏడు గంటల నుంచే ఉక్కపోత మొదలవుతోంది. దీనికితోడు గ్రామాల్లో అనధికార విద్యుత్ కోతలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తరచూ ఏర్పడటంతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. ఉక్కపోతలకు ఒళ్ళు మంట, శరీరంపై చిన్నచిన్న పొక్కులు, దురద వస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎండల ప్రభావంతో రేకుల షెడ్లలో నివశించే జనం నరకం అనుభవిస్తున్నారు.. ఫ్యాన్లు తిరుగుతున్నా చెమటలు తగ్గడం లేదు. ఎండలకు పక్షులు, మూగజీవాలు అల్లాడుతున్నాయి. రైతులు పశు వులను ఊర చెరువుల్లో దింపి ఎండల నుంచి కాపాడు కుంటున్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూలర్లు, ఎసిలు వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం కూడా బాగా పెరిగింది. ఉష్ణోగ్రతలకు ఇళ్లలోని అన్ని గృహోపకరణాలు వేడెక్కిపోతున్నాయి. ఉక్కపోత బాగా పెరిగితే ప్రజలకు ప్రాణహాని కలిగే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే పలువురు జ్వరాల బారిన పడుతున్నారు.

ప్రాంతం	ఉష్ణోగ్రత డిగ్రీలలో
విజయనగరం	41
సాలూరు	43
పార్వతీపురం	43
బొబ్బిలి	43
శృంగవరపుకోట	42
గజపతినగరం	43
పాలకొండ	42
రాజాం	42

నిర్మానుష్యంగా మారిన ఎంజి రోడ్డు, బాలాజి మార్కెట్ ప్రాంతాలు

13 ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలు

ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపుల్లో ఉచిత విద్య

ఒక్కో పాఠశాలలో 160 సీట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని 13 ఆదర్శ పాఠశాలల్లో 2023 - 24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్ లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపుల్లో ప్రవేశాలకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ/ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశా లలో 10వ తరగతిలో ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. వివరాల కోసం ఆదర్శ పాఠశాల వెబ్‌సైట్‌ను సందర్శించ వచ్చు. దరఖాస్తు రుసుము ఒసి, బిసి, ఇడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200. ఎస్‌సి, ఎస్‌టిలు రూ.150 చెల్లించాలి. 10వ తరగతి మార్కుల ఆధారంగా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుంది. ఇతర వివరాలకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్, లేదంటే సంబంధిత మండల విద్యాశాఖాధికారిని సంప్రదించ వచ్చు.

సీట్లు వివరాలు

ఒక్కో పాఠశాలలో నాలుగు గ్రూపులకు (40 చొప్పున) కలిపి 160 సీట్లు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 ఆదర్శ పాఠశాలల్లో 2,080 సీట్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు వారికి నచ్చిన గ్రూపులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలి

ఆరో తేది గడువు

ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు సం బంధించి జూన్ 6వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దర ఖాస్తు చేసుకోవాలని డిఇఒ లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఒక్కో పాఠశాలలో అన్ని గ్రూపులు కలిపి మొత్తం 160 సీట్లు భర్తీ చేస్తామన్నారు. చక్కని అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్వరలో శంకుస్థాపన మహోత్సవాలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి • నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

త్వరలో శంకుస్థాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి వెల్లడించారు. శనివారం నగరంలోని 2,15,9 డివిజన్లో 33 లక్షల రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఫూల్ బాగ్, మంగళ వీధిలో ఉన్న పార్కు ప్రహరీ గోడ రహదారి నిర్మాణానికి, 15వ డివిజన్‌లో రహదారి నిర్మాణానికి శంకుస్థాపనలు చేయగా, 9వ డివిజన్లో రహదారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసామని చెప్పారు. త్వరలోనే శంకుస్థాపన మహోత్సవాలు నిర్వహించి నెలరోజుల పాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు. నిత్యం ప్రజల సమక్షంలోని ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని గుర్తు చేశారు. వేసవిలో కూడా నీటి ఎద్దడికి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలతో ముందుకు వెళ_న్నామన్నారు.



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన మహోత్సవాలలో శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వి వి రాజేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు బండారు ఆనందరావు, అల్లు చాణిక్య, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

జొన్నగుడ్డిలో గడపగడపకూ..

నగరంలోని 27వ డివిజన్ జొన్నగుడ్డి ప్రాంతంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలను నేరుగా కలుసుకొని వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. సంక్షేమ పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారన్నారు. ఇదే పరిస్థితుల్లో స్థానికంగా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చూపుతున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత, నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, డిఇ అప్పారావు, ఎఇలు, జోనల్ ఇన్చార్జ్ రెడ్డి గురుమూర్తి, వైసిపి నాయకులు ఎవర్న కుమారస్వామి, దుప్పాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

మహేందర్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని స్థానిక ఎల్‌బి కాలనీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమీపంలో నూతనంగా నిర్మించిన మహేందర్ లేప్రోస్కోపిక్ హాస్పిటల్‌ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ప్రారంభించారు. డాక్టర్స్ ఛాంబర్స్, అత్యవసర వార్డు ఇతర విభాగాలను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు విజయనగరం మేయర్ వి.విజయలకిష్మి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ మహేందర్ గిరి సేవా భావం కలవారని, అందరికి అందుబాటులో ఉండే వ్యక్తి అని అన్నారు. అధునూతన వసతులతో నూతనంగా హాస్పిటల్ ఏర్పాటు చేసారని, ఆయన వైద్య సేవలను నగర ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఎ పూర్వ అధ్యక్షులు విఎస్ ప్రసాద్, టిడిపి నాయకులు బొద్దల నర్సింగరావు, తూర్పు కాపు సంఘం నాయకులు మజ్జి అప్పారావు, రొంగలి రామారావు, ఆర్లె కృష్ణారావు, పలువురు కార్పొరేటర్లు, వైద్యులు పాల్గొని డాక్టర్ మహేందర్ గిరికి అభినందనలు తెలిపారు.

యాంత్రీకరణను రైతులు అందుకునేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కాలం మారుతోంది. మనుషులు, పశువులు చేయాల్సిన పని ప్రస్తుతం యంత్రాలతో చేపట్టే టెక్నాలజీ వచ్చింది. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఆధునిక యంత్రాలు, పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో, పూర్వం నుంచీ సాగులో ఉపయోగించే నాగలి, నక్కు, మేడు, వాటిని లాగేందుకు కాడెద్దులు కనిపించడం లేదు. వాటి స్థానంలో ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు వంటివి వచ్చాయి. గడిచిన దశాబ్ధ కాలంలో మరో అడుగు ముందుకు పడింది. కలుపు మొక్కలు, వరికోత, నూర్పిడి యంత్రాలు వంటివి అందుబాటులోకి వచ్చాయి. ఈ ఆధునిక వ్యవసాయ యంత్రాల వల్ల సకాలంలో పనులు జరగడంతోపాటు రైతులకు యాతన తగ్గింది. కానీ, వీటిని అందుకునే పరిస్థితుల్లో రైతులు లేరు. ముఖ్యంగా మన జిల్లాలో ఎక్కువ మంది సన్నచిన్నకారు రైతులే ఉన్నారు. భూకమతాలు కూడా చిన్నచిన్నవిగా ఉండడంతో నాగలి, ఎడ్ల సాయంతో పూర్వం నుంచి సాగుపద్ధతి అమలవుతోంది. కానీ, ప్రస్తుతం టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినందుకు సంబరపడాలో బాధపడాలో తెలియని పరిస్థితి. ఇందుకు కారణం లేకపోలేదు. మారిన టెక్నాలజీని రైతులు అందుబాటు లేకపోవడమే ఇందుకు కారణం. దీంతో, వ్యవసాయ యంత్ర పరికరాలు కేవలం ధనిక రైతులు, ఆర్థికంగా కాస్త అవకాశం ఉన్నవారికే పరిమితమౌతున్నాయి. యంత్ర సేవ పథకంలో భాగంగా ఆర్‌బికెల వారీగా సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను ప్రభుత్వం పంపిణీ చేస్తున్న విషయం విధితమే. జిల్లాలో 184 సిహెచ్‌సిలకు 505 రకాల యంత్ర పరికరాలను ప్రభుత్వం శుక్రవారం అందజేసింది. వాటి విలువ రూ.15.20 కోట్లు కాగా ఇందులో సబ్సిడీ రూపంలో రూ.4.54 కోట్లు

అందించామని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. గత ఏడాది మొదటి విడత యంత్ర పరికరాల పంపిణీలో 310 గ్రూపులకు రూ.28.45 కోట్ల విలువైన పరికరాలను అందజేశారు. ఇందులో రూ.9.34కోట్లను సబ్సిడీగా అందజేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ రైతులకే చెందే విధంగా రైతు మిత్ర సంఘాలను ఏర్పాటు చేసి 40 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తోంది. ఇంత వరకు బాగానే ఉన్నా మన జిల్లా రైతాంగానిది ప్రత్యేక పరిస్థితి. తగిన నీటి వసతి లేకపోవడం వల్ల ఏడాదికి ఒక్కపంట (ఖరీఫ్) మాత్రమే సాగవుతోంది. ఇది కూడా వర్షాధారంగానే. సాగునీటి వనరులు ఉన్నా వాటిని పలుకులు పట్టించుకోకపోవడంతో రైతులు వరుణుడి కరుణపైనే ఆధారపడుతున్నారు. దీనికి తోడు ప్రకృతి వైపరీత్యాలు, అమాంతంగా పెరిగిన ఎరువులు, పురుగు మందులు, ఇతరత్రా ధరల వల్ల కష్టనష్టాలకు గురి కావాల్సివస్తోంది. ఫలితంగా సాగులో వ్యవసాయ యంత్రాల అద్దె చెల్లించుకోడమే కష్టతరంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో రూ.లక్షల విలువగల యాత్రాలను కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం తరపున 40శాతం సబ్సిడీ ఉన్నప్పటికీ దాన్ని కూడా అందుకునే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్స్ కాస్త ధనవంతులకే పరిమితమౌతున్నాయి. చాలా చోట్ల ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకరు లేదా ఇద్దరే మిగిలిన సభ్యుల పేర్లతో ఆయా యూనిట్లను పొందుతున్నారు. దీనివల్ల సభ్యులకేమీ నష్టం లేకపోయినప్పటికీ రైతుల దీనస్థితికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో సబ్సిడీని పెంచడం లేదా ఆయా రైతుల భాగస్వామ్యాన్ని పెంచడం వంటివి చేస్తే తప్ప పేద రైతులు వాటిని ఉపయోగించుకునే పరిస్థితి లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

విద్యుత్తు శాఖ ఎస్‌ఇగా లక్ష్మణరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఇ లక్ష్మణరావు

విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా ముప్వల లక్ష్మణరావు నియమితుల య్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఎస్‌ఇగా విధులు నిర్వహించిన పి.నాగేశ్వరరావు స్థానంలో కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ గా విధులు నిర్వహించిన లక్ష్మణరావు ఎస్‌ఇగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఇఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి, విద్యుత్ శాఖ సిబ్బంది, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

5 నుంచి డయేరియాపై ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

డయేరియాతో ఏ ఒక్కరూ మరణించకూడదనే ఉద్దేశంతో డయేరియా పై ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్.భాస్కర రావు తెలిపారు. శనివారం తన ఛాంబర్ లో విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 5 నుండి 17 వరకు జరిగే ఈ ప్రత్యేక కాంపెయిన్ లో ఆశావర్కర్లు, ఎఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తారని తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలకు డయేరియా రాకుండా వారి తల్లులకు అవగాహన కల్పిస్తామన్నారు. డయేరియా రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వస్తే ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశాల పై అవగాహన కల్పిస్తామన్నారు. ఎవరికైనా సివియర్ డయేరియా ఉంటే సమీప సిహెచ్‌సి లేదా పిహెచ్ సిలకు రిఫర్ చేయాలని అన్నారు. తీవ్రమైన ఎండలకు వడ దెబ్బ తగలకుండా గొడుగును వాడడం, చేనేత వస్త్రాలను ధరించడం చేయాలని తెలిపారు. వడదెబ్బ వల్ల ఎవరైనా కోమా లోకి వెళితే వారికి నీరు తాగించకూడదని, చల్లని ప్రదేశంలో ఉంచి వైద్యం అందించాలని తెలిపారు.

గోడౌన్‌ను పరిశీలిస్తున్న జెసి మయూర్ అశోక్, డిఆర్ఓ గణపతిరావు

ఇవిఎంలకు కొత్త గిడ్డంగి సిద్ధం : జెసి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచేందుకు నెల్లిమర్లలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంతంలో నిర్మించిన నూతన గిడ్డంగి భవనాన్ని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శనివారం పరిశీలించారు. ఈ భవనంలో ఉమ్మడి జిల్లా అవసరాలకు తగ్గట్టుగా 9 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఇవిఎంలు భద్రపరిచేందుకు భవనం పై అంతస్థులో తొమ్మిది గదులను నిర్మించడం జరిగిందని జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు జెసికి వివరించారు. ఈ భవనానికి కల్పిస్తున్న భద్రత, సిసి టివిల ఏర్పాటు తదితర అంశాలను జెసి పరిశీలించారు. ఈ పర్యటనలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, డిఆర్ఓ గణపతిరావు, తహశీల్దార్ కెవి రమణరాజు, మునిసిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, ఎన్నికల విభాగం తహశీల్దార్ దేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోటి చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

ఇరిగేషన్ కార్యాలయం వద్ద సిపిఐ, కాంగ్రెస్ ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి

కోటి చెరువు ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్, సిపిఐ ఆధ్వర్యాన శనివారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఇరిగేషన్ అధికారి సురేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు కోట అప్పన్న, ఎం.శ్రీనివాసరావు, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కృషి

ప్రజాశక్తి- చీపురుపల్లి

కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మూడు రోడ్ల జంక్షన్ నుండి జివిఆర్ కాలేజ్ వరకు జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ ప్రారంభించారు. ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ మాట్లాడుతూ యునైటెడ్ నేషన్స్ జనరల్ ఆసెంబ్లీ జూన్ 3 తేదీన ప్రపంచ సైకిల్ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించారన్నారు. ఈ కార్యక్రమంలో చీలకయ్య, ఆశయ సంస్థ సభ్యులు చంటి యువత పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రమేష్

ప్రత్యేకాధికారి సమీక్ష

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో ప్రత్యేక అధికారి రమేష్ శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్,నాడు-నేడు, ఫ్యామిలీ డాక్టర్ సేవలు, ఉపాధి హామీ పనులను మొదలైన ఆయా శాఖల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా కొత్తబగ్గాం గ్రామంలో జగనన్న లేఔట్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిల్వచేసిన జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.అరుణకుమారి, ఎంపిడిఒ పప్పు.సుదర్శన్, ఎంఇఒ విములమ్మ, ఎపిఒ సిహెచ్.రామారావు, ఎపిఎం యు.జగదీష్, పల్లి సంజీవరావు పాల్గొన్నారు.

లెండిలో ఎఐన్, లాట్ ఎక్సలెన్స్ సెంటర్లు

ప్రజాశక్తి- డెంకాడ

జొన్నాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కాలేజ్‌లో శనివారం ఎఐన్, లాట్ ఎక్సలెన్స్ సెంటర్‌ల శనివారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి శ్రీకృష్ణ దేవరాయ, జెఎన్‌టియు అనంతపురం విశ్వవిద్యాలయాల మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. రాజగోపాల్, హైదరాబాద్‌కు చెందిన జెన్‌క్యూ టెక్నాలజీస్ మాజీ సిఇఒ మురళి బొల్లు పాల్గొని మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ రంగాలలో అత్యాధునిక సాంకేతికతలను, ప్రతిభను పెంపొందించడానికి ఎక్సలెన్స్ సెంటర్‌లు తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి. రాజ్యలక్ష్మి, వివిధ విభాగాల హెచ్‌ఒడిలు, సంస్థ వైస్ చైర్మన్ పి. శ్రీనివాసరావు, సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె శివరామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారి కేన్సర్ చికిత్సకు సిఎం సహాయం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కందిశ గ్రామానికి చెందిన పొన్నగంటి లావణ్య, కన్నబాబుల కుమార్తె హేమలత కేన్సర్‌తో బాధపడుతుంది. వావిలవలసకు చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిగూడెం లో కలిసి ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన సిఎం రూ. లక్షతో పాటు హేమలతకు హాస్పిటల్ వైద్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ కింద ప్రతి నెలా ఆస్పత్రిలో జమ చేసేందుకు రూ. 38వేలు ఇవ్వనున్నట్లు అంగీకరించారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

శృంగవరపుకోట : పట్టణానికి చెందిన కొట్టాడ సంతోషి కుమారుడు కిడ్నీ ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును శనివారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, పుణ్యగిరి ట్రస్ట్ చైర్మన్ పోలమరశెట్టి రామకృష్ణ, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పల్లా భీష్మ, పేనగంటి చెల్లయ్య, వార్డు సభ్యులు మజ్జి శేఖర్, గనివాడ శ్రీను, పొడుగు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించే వ్యవసాయ పథకాలపై మండల వ్యవసాయ అధికారి కె.రవీంద్ర అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని సంత గైరమ్మపేట రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. పచ్చిరొట్ట విత్తనాల వల్ల ఉపయోగాలు, పంట మార్పిడి, రాయితీపై వరి విత్తనాలు, చిరుధాన్యాల సాగు ఆవశ్యకత, రైతు భరోసా కేంద్రం రైతులకు అందించే ఎరువులు, పురుగుమందులు, రైతు భరోసా, యంత్రసేవ, తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగాడ కళావతి, విఎఎలు రవి, చంద్రకుమార్, రైతులు ఈశ్వరరావు, చలుమూరి దేముడు, రవి పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

వేపాడ : మండలంలో సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నాడు-నేడు నిధులతో చేపట్టిన పనులను ఎంఇఒ శ్రీదేవి పరిశీలించారు. పనులపై సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిఆర్‌పి కె.రాంప్రసాద్ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు కోసం పొలాల్లో రాళ్లు

- అనుమతి లేకుండా పాతారని తీసేసిన రైతులు
- మెరుగైన పరిహారం ఇవ్వాలని తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పెందుర్తి నుంచి మండలంలోని బొడ్డవర వరకు నిర్మించ తలపెట్టిన నాలుగులైన్ల 516 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా శృంగవరపుకోట పట్టణంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి రైతుల పొలాల్లో శనివారం రెవిన్యూ అధికారుల సహకారంతో రాళ్లను పాతుతున్నారు. సమాచారం తెలుసుకున్న రైతులు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో అక్కడికి చేరుకొని పాతిన రాళ్లను పీకి పడేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా కమిటీ సభ్యులు గేదెల శ్రీను మాట్లాడుతూ. మండల పరిధిలో గల వెంకటరమణపేట, కొత్తూరు, శివరామరాజుపేట, శృంగవరపుకోట, సీతంపేట గ్రామాలకు చెందిన రైతులు బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్నారని అన్నారు. అధికారులు రైతులకు ముందస్తు సమాచారం అందించకుండా వారి భూముల్లో ఆరు కిలోమీటర్ల బైపాస్ రోడ్డు కోసం బలవంతంగా సర్వే రాళ్లను వేస్తున్నారని అన్నారు. వెంకటరమణపేట, కొత్తూరు, శివరామరాజు పేట గ్రామాల్లోని రైతుల భూముల్లో సర్వేరాళ్ల పాతడంతో తొలగించామన్నారు. సీతంపేట పరిధిలో రాళ్ల పాతుతుంటే సర్వే రాళ్ళు పాతుతున్న వారితో రైతన్నలు గొడవకు దిగారని. అక్కడితో వారు పనులు ఆపి వేరొకచోటకు వెళ్లిపోయారని అన్నారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి అందజేశారు. భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంచిన రాము, కొట్టాన సూర్యం, నానిగిరి సోమినాయుడు, వి సన్యాసిరావు, ఎం.లక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతినిస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

వైభవంగా రామాలయ ప్రతిష్ట

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడలో కోదండ రామాలయ ప్రతిష్ట, ప్రారంభం వైభవపేత్తంగా శనివారం జరిగింది. ఉదయం నుంచే గ్రామ పెద్దలతో పాటు ప్రజలు రామాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల చేత కళ్యాణం కూడా జరిపించారు. రామాలయ ప్రతిష్ట, ఆలయాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర రావు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, నెల్లిమర్ల జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, పిఎసిఎస్ చైర్మన రొంగలి కనక సింహాచలం, నాయకులు చనమల్లు వెంకటరమణ, మహంతి శ్రీనివాసరావు, అంబళ్ల శ్రీరాముల నాయుడు రామాలయాన్ని సందర్శించారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు. అనంతరం గ్రామంలో 4వేల మందికి అన్నదానం చేశారు. మూడు రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ లంక లక్ష్మణరావు, ఎంపిటిసి విజినిగిరి చిన్నంనాయుడు, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, మాజీ ఎంపిటిసి కొర్నాన ఆదిబాబు, మాజీ సర్పంచ్ వాళ్ళ వెంకట్రావు, మాజీ ఎంపిటిసి లంక రామారావు, వైస్ సర్పంచ్ రేవల్ల అప్పలనాయుడు, గ్రామ పెద్దలు, ప్రజలు, యువకులు పాల్గొని ఆలయ ప్రతిష్ఠను విజయవంతం చేశారు.

ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పథకాల అమల్లో వాలంటీర్లదే కీలకపాత్ర

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజల చెంతకు చేర్చడంలో వాలంటీర్లే కీలక పాత్ర పోషిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని 11వ సచివాలయంలో వాలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. 98.5 శాతం హామీలను సిఎం జగన్ నెరవేర్చారని చెప్పారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధుల్లా పనిచేస్తున్న వాలంటీర్లు నిష్పక్షపాతంగా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించి ముఖ్యమంత్రికి వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తెంటు పార్వతి, కొర్లపు రామారావు, వైసిపి నాయకులు రమేష్, బబ్లూ, శంకర్రావు పాల్గొన్నారు.

వాలంటీర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణ

పనుల నత్తనడకపై ఆగ్రహం

ప్రజాశక్తి -వేపాడ

మండలంలోని వావిలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో రెండో విడత మంజూరైన నాడు-నేడు పనులను మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ పరిశీలించారు. పనులు నత్తనడకన సాగుతుండటంతో సంబంధిత అధికారిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధ్యతగా పనిచేయాలని, సకాలంలో పనులు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, మండల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఆలీ, సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ.. శనివారం మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై శాఖల వారీగా సమీక్షించారు. అసంపూర్తిగా ఉన్న పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు.

వేపాడ : నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

బొండపల్లి : మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్

నాడు-నేడు పనులు వేగవంతం

బొండపల్లి: నాడు-నేడు పనులను పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి దుర్గా ప్రసాద్ కోరారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి చల్ల చలంనాయుడు అధ్యక్షతన మండల స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల, అంగన్వాడీ, సచివాలయాలు, రైతు భరోసా తదితర పనులను వేగవంతం చేయాలన్నారు. నిరంతరం పర్యవేక్షణ చేస్తూ సకాలంలో నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాదరావు, వ్యవసాయ అధికారి మల్లికార్జునరావు, ఎపిఒ బి.కృష్ణవేణి, ఎంఇఒ భూషినాయుడు, ఎపిఎం సులోచనదేవి, పిఆర్ ఎఇ కృష్ణమూర్తి పాల్గొన్నారు

సైక్లింగ్‌తో బాలలకు ఆరోగ్యం

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి

ప్రజాశక్తి-విజయనగరం

సైక్లింగ్ చేయడం ద్వారా బాలలకు మంచి ఆరోగ్యం లభిస్తుందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. శనివారం ఉదయం స్థానిక రాజీవ్ స్టేడియం వద్ద ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా బాలల సైకిల్ ర్యాలీని ఆయన రోటరీ 2024 గవర్నర్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. నెహ్రూ యువకేంద్రం, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల సహకారంతో స్థానిక విజయదుర్గా యూత్ సొసైటీ అధ్యక్షురాలు కేశవపట్నం చంద్రిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేసలి మాట్లాడుతూ పిల్లలు చిన్న వయసు లోనే సైకిల్ వాడకం అలవాటు చేసుకోవాలని అన్నారు. డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటి తరం సరియైన ఆహార నియమాలు పాటించకపోవడం, సరియైన వ్యాయామం లేకపోవడం వల్ల చిన్న వయసు లోనే రోగాలు పాలయ్యి ఆర్థికంగా కూడా నష్టపోతున్నారని అన్నారు.

సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న కేసలి అప్పారావు

బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఆర్అండ్‌బి అధికారులు

కొట్టాం బ్రిడ్జి పరిశీలన

ప్రజాశక్తి - జామి

జామి-కొట్టాం వంతెనను ఆర్అండ్‌బి ఇఇ రమణ శనివారం పరిశీలించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల కోసం భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో గోస్తనీ నదిపై ఉన్న కొట్టాం బ్రిడ్జి దెబ్బతింది. ఈ విషయంపై 'ప్రజాశక్తి' కథనాలను ప్రచురించింది. విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తాజాగా స్థానిక అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆందోళన చేపట్టారు. జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు పెదబాబు ఆధ్వర్యంలో ఆందోళన చేయగా, వైసిపి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ ఆధ్వర్యంలో విజినిగిరి, తాండ్రంగి గ్రామాల సర్పంచులు మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి, సమస్య వివరించారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఆర్అండ్‌బి ఇఇ రమణ బ్రిడ్జిని పరిశీలించి, త్వరలోనే మరమ్మతులకు చర్యలు చేపడతామని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ జి.రవికుమార్, విజినిగిరి, తాండ్రంగి సర్పంచులు సూర్యారావు, దశరథ, నీటిపారుదల శాఖ అధికారి యడ్ల గోవింద్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు పెదబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో కాంట్రాక్టర్లు పనులు చేసినా బిల్లులు కాకపోవడంతో 15వ ఆర్థిక సంఘం పనులు, గడపగడపకు ప్రభుత్వం పనులు చేసేందుకు ముందుకు రాలేదన్నారు. 14వ ఆర్థిక సంఘం బకాయి బిల్లులు రూ.13 కోట్ల వరకు కాంట్రాక్టర్లకు జమ కావడంతో అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. మున్సిపాలిటీలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు ఒక్కొక్క సచివాలయానికి రూ.20లక్షలు చొప్పున మంజూరైనట్లు తెలిపారు. మున్సిపాలిటీలో 16 సచివాలయాల పరిధిలో 77 పనులకు రూ.3.20 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులు 54 పనులకు రూ.4.10 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ప్రభుత్వంపై నమ్మకం పోయింది

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. మండలంలోని సంతగౌరమ్మపేట, పోతనపల్లి గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాలలో ఆమె మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ఒక్క ఛాన్స్ అని రాష్ట్ర ప్రజలను మోసం చేశారని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, బీశెట్టి అరుణ, నాయకులు ఇందుకూరి శ్రీనురాజు, గోగాడ సత్యం, గోగాడ అప్పారావు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మండల కేంద్రంలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద తెలుగు యువత మండల అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర నాయకులు కె.బి.ఎ. రాంప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు, నాయకులు కోళ్ల వెంకటరమణ, కె.అప్పారావు, నక్కరాజు చినరాము, ఎల్లపు సూరిబాబు, కనకాల శివ, అయ్యారక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బంగారు రమేష్, విరోతి శివాజీ పాల్గొన్నారు.

జరజాపుపేటలో హౌసింగ్ డే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధి జరజాపుపేట జగనన్న లేఔట్‌లో హౌసింగ్ డే కార్యక్రమం శనివారం జరిగింది. మండల ప్రత్యేకాధికారి, జిల్లా హౌసింగ్ పీడీ ఎస్.వి రమణమూర్తి, హౌసింగ్ డిఇ జి. మురళీమోహన్ లే అవుట్ పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ రమణ మూర్తి మాట్లాడుతూ జరజాపుపేట లే అవుట్‌లో 88 ఇళ్ళు పునాదుల స్టేజ్‌లో ఉన్నాయని, 6 బిబిఎల్ స్థాయిలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నెలాఖరు నాటికి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ళు ప్రారంభించక పోతే నోటీసులు ఇచ్చి రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాయకులు నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, హౌసింగ్ ఎఇ ఆర్.పవన్, ఎఇ శివ, ఇంజినీర్ సంపతి, ఏడ్మిన్ సూర్య, సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీస్తున్న హౌసింగ్ పీడీ రమణమూర్తి

మినీ మేనిఫెస్టో ట్రైలర్ మాత్రమే

టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప క్రిష్ణ

ప్రజాశక్తి-వేపాడ

మహానాడులో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రజా సంక్షేమం కోసం ప్రకటించిన మినీ మేనిఫెస్టో ఒక ట్రైలర్ మాత్రమేనని టిడిపి నియోజకవర్గ యువ నాయకులు గొంప క్రిష్ణ తెలిపారు. ఆ మేనిఫెస్టోను చూసి వైసిపి నాయకుల గుండెల్లో గుబులు పుడుతోందని వ్యాఖ్యానించారు. శనివారం వేపాడలో మండల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షోభంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా నడిపించే ఆలోచనతో చంద్రబాబు మినీ మేనిఫెస్టోను ప్రకటించినట్లు తెలిపారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో ఇప్పటికే అత్యంత ప్రజాదరణ పొందినట్లు ఆయన తెలిపారు. పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఉపయోగకారిగా ఉండే విధంగా నిపుణులతో చర్చించి, రూపొందించినట్లు వివరించారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించే ఎన్నికల మేనిఫెస్టోను ఎన్నికల ముందు గ్రామస్థాయిలో ప్రజలకు వివరించేలా ప్రణాళికను సిద్ధం చేసినట్లు చెప్పారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విధంగా ప్రజలు సహకారం అందించాలని కోరారు. అధికారం చేపట్టిన తర్వాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, బానాది ఎంపిటిసి సభ్యులు గొంప తులసి, నాయకులు సిరికి రమణ, శానాపతి గణేష్, తదితరులు పాల్గొన్నారు. వేపాడలో రామాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు గొంప క్రిష్ణ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.



వేపాడ.. సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు గొంప కృష్ణ

మేనిఫెస్టోలో మహిళలకు ప్రాధాన్యత

శృంగవరపుకోట : టిడిపి మేనిఫెస్టోలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆ పార్టీ యువనేత గొంప క్రిష్ణ తెలిపారు. శనివారం మండలంలోని ఆలుగుబిల్లిలో టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామస్తులు నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల సెక్రటరీ జుత్తాడ రామసత్యం, గోపాలపల్లి సర్పంచ్ ఆడారి ఉమామహేశ్వరావు, లగుడు ఎర్నినాయుడు, మండా త్రినాథ, మాదిబోయిన మంగరాజు పాల్గొన్నారు.